క్లుప్తంగా

పరామర్శ



కరేటి దైవాదీనాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: అల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కరేటి దైవాదీనం, మాజీ సర్పంచ్ చంద్రలీలమ్మ దంపతులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల కరేటి దంపతుల కుమారుడు వినోద్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో కరేటి దంపతులను రామిరెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం బీరంగుంట ఉపసర్పంచ్ గుమ్మడి సాయిచరణ్‌ను పరామర్శించారు. సాయిచరణ్ తల్లి, కావలి ఏఎంసీ డైరెక్టర్ గుమ్మడి లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మారుస్తున్నందున దుత్తలూరు విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుత్తలూరు సెంటర్, దుత్తలూరు గ్రామం, బీసీకాలనీ, కట్టకిందపల్లి ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా అధ్యక్షుడిగా శేషం

ఆత్మకూరు: ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా శాఖ అధ్యక్షుడుగా శేషం సుదర్శన్ ఎంపికయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన మండలి సమావేశంలో రాష్ట్రాధ్యక్షుడు పీ రాజారావు తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. మర్రిపాడు మండలం రాంపల్లికి చెందిన శేషం సుదర్శన్ గతంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం సభ్యుడిగా సేవలు అందించారు. ప్రస్తుతం తన మిత్రులతో కలిసి హోప్ సంస్థ ద్వారా పేదలకు తన పరిధిలో సేవలు అందిస్తున్నారు.



శేషం సుదర్శన్

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ వితరణ



ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్

ఆత్మకూరు: ఏఎస్‌పేట మండలానికి చెందిన వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. ఆయనకు సరిగా ఆక్సిజన్ అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, డాక్టర్ జే ప్రణీత్ స్పందించారు. డాక్టర్ వింజం దొరసానమ్మ ట్రస్ట్ ద్వారా రూ.20వేల విలువైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను శనివారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్‌కుమార్, బాలఅంకయ్య, నరేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్రపై సమావేశం

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 21న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్ర ఏర్పాట్లపై సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశానికి శోభాయాత్ర కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. హనుమాన్ శోభాయాత్రలో హిందువులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయాభివృద్ధికి సహకరించాలని వినతి

ఆత్మకూరు: పట్టణంలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘనాథస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు నెల్లూరులోని నివాసంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్ల క్రితం పురావస్తు శాఖ, దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించినట్లు తెలిపారు. ఇటీవల ఆలయానికి అనుబంధంగా కల్యాణ మండపం, తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇందుకు దేవాదాయ శాఖ నుంచి ఆర్థిక సాయం అందించాలని కోరారు. పీహెచ్‌సీ జిల్లా ఉపాధ్యక్షులు యానాదిరెడ్డి, కేవీ శేషారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బీసీ వసతిగృహం



శిథిలావస్థకు చేరిన వింజమూరు బీసీ సంక్షేమ వసతి గృహం



తలుపులు లేని మరుగుదొడ్లు

వింజమూరులోని బీసీ కాలనీ రోడ్డులో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ వసతిగృహంలో సుమారు 60 మంది విద్యార్థులు ఉన్నారు. 30 ఏళ్ల క్రితం వసతి గృహ భవనాన్ని నిర్మించారు. భవన కాలపరిమితి పూర్తవడంతో శ్లాబ్ దెబ్బతిని పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం పడితే ఉరుస్తోంది. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరోవైపు వసతిగృహంలో విద్యార్థులకు అనుగుణంగా మరుగుదొడ్లు సైతం లేవు. కొన్ని మరుగుదొడ్లకు తలుపులు కూడా లేవు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వసతిగృహంలోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– వింజమూరు(ఉదయగిరి)



దెబ్బతిని పెచ్చులూడి పడుతున్న శ్లాబ్

మంత్రుల పర్యటన ఏర్పాట్ల పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల ప్రాజెక్ట్ సందర్శనకు ఆదివారం ముగ్గురు మంత్రులు రానున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లను సోమశిల ఎస్సై సుబ్బారావుతో కలిసి ఆత్మకూరు సీఐ వేణు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోమశిల జలాశయం ఆప్రాన్‌ను పరిశీలించేందుకు మంత్రులు వస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను జేసీబీ తొలగించే పనులతో పాటు ఆప్రాన్ వద్ద చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. వారి వెంట కానిస్టేబుల్ పెంచలయ్య ఉన్నారు.



చెట్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న సీఐ వేణు, ఎస్సై సుబ్బారావు

నేటి నుంచి సామాజిక తనిఖీలు

ఆత్మకూరురూరల్: మండలంలో ఆదివారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు సోషల్ ఆడిట్ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ నాగార్జున తెలిపారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈసీబీ జానకి అధ్యక్షతన డీఆర్పీలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, టీఏలు, పీఓలతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.10.72 కోట్లతో ఉపాధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులను సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించి గుర్తించిన అవకతవకలను గ్రామసభల ద్వారా ప్రజలకు తెలియజేస్తారని వివరించారు. అనంతరం మండల కేంద్రంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సోషల్ ఆడిట్ రిసోర్స్‌పర్సన్ నాగార్జున

అలంకారప్రాయంగా సంపద తయారీ కేంద్రాలు



పిచ్చిచెట్లతో నిండిన సంపద తయారీ కేంద్రం

సీతారామపురం : మండలంలోని 14 పంచాయతీల్లో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టింది. తడి చెత్తను వర్మికంపోస్టు మార్చి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని సంకల్పించింది. అయితే పంచాయతీలపాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు చెత్తను సేకరించడం మానేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటుంది. సంపద తయారీ కేంద్రాల్లో ఎక్కడా వర్మీకంపోస్ట్ తయారు కావడం లేదు. చెత్త రిక్షాలు సైతం మూలన పడి తుప్పు పడుతున్నాయి. డంపింగ్ యార్డులు పిచ్చి చెట్లు, ముళ్లపొదలతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలను గాలికి వదిలేయడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మట్టి మనుషులు కవితకు పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ రచించిన మట్టి మనుషులు కవితకు సాహితీ పురస్కారం లభించింది. పెన్నా రచయితల సంఘం 15వ వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరులోని పుర మందిరంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సుధీర్‌కుమార్‌కు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీయూ తెలుగు శాఖాధిపతి మేడిపల్లి రవికుమార్, ఏపీ జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసులు, పెన్నా రచయితల సంఘం నిర్వాహకులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకున్న ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్

21న కళానీరాజనం

నెల్లూరు(బృందావనం) : ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'అరిగెపూడి కృష్ణకుమారి కళానీరాజనం' కార్యక్రమాన్ని నగరంలోని పురమందిరంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. సుబేదారుపేటలోని సంఘ కార్యాలయం వద్ద కళానీరాజనం ఆహ్వాన పత్రికలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారంగానికి విశిష్ట సేవలందిస్తున్న అరిగెపూడి విజయకుమార్ సతీమణి కృష్ణకుమారి కళాకారుల సంక్షేమానికి చేసిన సేవలను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. కళానీరాజనంలో భాగంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాటలు, నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్ల చెప్పారు. ప్రతిభ కనబర్చిన కళాకారులకు ప్రోత్సాహక నగదుతో పాటు షీల్డ్ అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమాలను అరిగెపూడి విజయకుమార్ సహకారంతో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ పర్యవేక్షణలో చేపడుతున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే గాయకులు, నృత్య కళాకారులు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో బి.రఘురామిరెడ్డి, వి.మహేష్, రాము, విశ్వేశ్వరప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

కేజీబీవీలో తనిఖీలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల భోజన సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా విద్యా విషయక పర్యవేక్షణ అధికారి సుదీర్‌బాబు ఉన్నారు.

ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు

వరికుంటపాడు: తెల్ల పశువుల్లో వచ్చే ముద్ద చర్మ వ్యాధి నివారణకు ఈ నెల 20 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు టీకాలు వేస్తున్నట్లు ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 450 వరకు ఆవులు, ఎద్దులు, లేగ దూడలు ఉన్నాయని తెలిపారు. వాటికి టీకాలను వేస్తున్నట్లు చెప్పారు. పశుపోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సీఎంపై అక్రమ కేసులు తగవు

ఆత్మకూరు: ప్రజల ఆదరాభిమానాలతో ఐదేళ్ల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసి 40 శాతం ఓటు బ్యాంకు కలిగి ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమికి ప్రజలు ఒక అవకాశం ఇచ్చారని, దానిని సద్వినియోగం చేసుకుని ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలే తప్ప ఇలా అక్రమంగా కేసులు బనాయించడం మంచిపద్ధతి కాదన్నారు. కక్ష సాధింపుతో పాత కేసులు తిరగదోడి కేసులు నమోదు చేయడంపై రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఈసడించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసేలా వ్యవహరించాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆయన హితవుపలికారు.

21న గురుపౌర్ణమి వేడుకలు



వరికుంటపాడు: స్థానిక సాయిబాబా మందిరంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ మందిర వ్యవస్థాపక ధర్మకర్తలు సుంకర వెంకటాద్రి, సుజన దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, విశేష పూజలు, పాదస్పర్శ దర్శనం, హోమాలు, మధ్యాహ్నం హారతి, అన్నదాన, సాయంత్రం గ్రామోత్సవం, పల్లకిసేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కాగా గ్రామంలో సాయిబాబా భక్తులు శనివారం భిక్షాటన చేసి విరాళాలు సేకరించారు.

19న రాజరాజేశ్వరికి శాకంబరి అలంకారం

నెల్లూరు(బృందావనం) : ఆషాడ మాసం సందర్భంగా నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 19వ తేదీన అమ్మవారికి శాకంబరి అలంకారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ధర్మకర్త రత్నం జయరాం, ఈఓ జే వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. వివిధ రకాల కాయగూరలు, ఫలాలతో అమ్మవారిని అలంకరించనున్నట్లు చెప్పారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేటి నుంచి కలిగిరమ్మ తిరునాళ్ల

కలిగిరి: కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్ల ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయం ముందు సుడిమానును నిలిపి తిరునాళ్లకు అంకురార్పణ చేస్తారు. రెండో రోజు సోమవారం అమ్మవారి పుట్టినిల్లు అయిన పాపనముసిలిపాళెంలో విశేష పూజలు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. మూడోరోజు మంగళవారం మెట్టినిల్లు అయిన జిర్రావారిపాళేనికి అమ్మవారిని చేరుస్తారు. బుధవారం జిర్రావారిపాళెంలో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారిని కలిగిరికి చేరుస్తారు. తిరునాళ్ల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం కలిగిరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారు. మధ్యాహ్నం నుంచి ఆలయం చుట్టూ బండ్లు తిప్పుతారు. చివరిగా సుడిమానును తిప్పి తిరునాళ్లను ముగిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానుండడంతో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలిగిరి సీఐ ఫిరోజ్, ఎస్సై సంతోష్‌రెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



విశేషాలంకరణలో కలిగిరమ్మ

పశు పోషణపై అవగాహన కలిగిఉండాలి

ఆత్మకూరురూరల్: పశు పోషణపై పాడి రైతులు అవగాహన కలిగిఉండాలని ఆత్మకూరు పశుసంవర్ధక శాఖ ఏడీ జయచంద్ర అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బోయలచిరివెళ్లలో పశు పోషణపై పాడిరైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు మేలుజాతి పశుగ్రాసాలతో పాటు దాణా వేయడం వల్ల పాల దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. తద్వారా పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వివరించారు. కరటంపాడు పశువైద్యశాల పరిధిలోని పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువైద్యాధికారి కృష్ణయాదవ్ పశుపోషణలోని మెలకువలను వివరించారు. అనంతరం పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు. సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, వెటర్నరీ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.



రైతులకు పశుగ్రాసం గెనుపులను అందజేస్తున్న ఏడీ జయచంద్ర

నూరు శాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలి

వరికుంటపాడు: వైద్యఆరోగ్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించి నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలని కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ పీ రాజశేఖర్ ఆదేశించారు. మండలంలోని అశోక్‌నగర్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. టీకాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సూచనలు చేశారు.అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో ముందు రోజే టీకాలు వేయాల్సిన వారి జాబితాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులందరికీ టీకాలు వేసి నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ రాజశేఖర్

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు ప్రోత్సాహక నగదు బహుమతులను శనివారం ప్రదానం చేశారు. ఎస్ వేణుకు ప్రథమ బహుమతి రూ.10వేలు, బీ చైతన్యకు ద్వితీయ బహుమతి రూ.7500, శివాజీ, హర్షవర్ధన్‌కు తృతీయ బహుమతి రూ.5 వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పుష్పరాజ్, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు సుమన్, షారోన్, కిషన్, జీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెల్లరాయి అక్రమ తవ్వకాలపై సీసీఎస్ పోలీసుల విచారణ

ఉదయగిరి: మండలంలో తెల్లరాయి అక్రమ తవ్వకాలు, రవాణాపై సీసీఎస్ పోలీసులు శనివారం విచారణ చేపట్టారు. ముందుగా తెల్లరాయి అక్రమంగా తవ్వకాలు చేస్తున్న మాసాయిపేట, కొండాయపాళెం, అప్పసముద్రం, ఆర్లపడియ, కృష్ణంపల్లి, తిరుమలాపురం, తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఇటీవల మండలంలో జరుగుతున్న తెల్లరాయి అక్రమ తవ్వకాలు, రవాణాపై డీజీపీకి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. డీజీపీ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ సాంబశివరావు, ఏఎస్సై రవి ఉదయగిరి స్టేషన్‌కు చేరుకుని స్థానిక పోలీసులతో చర్చించారు. గతంలో నమోదు చేసిన కేసుల గురించి ఆరాతీశారు. తెల్లరాయి తవ్వకాలు, లీజు తదితర అంశాలపై చర్చించారు.

ఘనంగా పెరసం వార్షికోత్సవం

- 'ఆకురాలిన చప్పుడు'కు సాహిత్య పురస్కారం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరం ప్రాంగణం వర్ధమాన సమాజం హాల్లో 'పెన్నా రచయితల సంఘం' (పెరసం) 15వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన కవి వశిష్ట సోమేపల్లి కవితా సంపుటి 'ఆకురాలిన చప్పుడు'కు ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి 'పెన్నా సాహిత్య పురస్కారం-2024' అందజేసి ఆయన్ను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఏపీజెన్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన 'సమకాలిన కవిత్వం-ప్రక్రియా వైవిధ్యం'పై తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ ఉపన్యసించారు. అలాగే పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి 'ఇటీవలి కవిత్వం-సమీక్షణం'పై ప్రసంగించారు. కవి, విమర్శకులు డాక్టర్ సుంకరగోపాల్ 'ఆకురాలు కాలం గ్రంథ సమాలోచన'పై ఉపన్యసించారు. అనంతరం నెల్లూరుకు చెందిన కవి అవ్వారు శ్రీధర్‌బాబు రచించిన 'పడమటి సూర్యోదయం' పుస్తకాన్ని రచయిత్రి సోమిరెడ్డి జయప్రద ఆవిష్కరించారు. న్యాయనిర్ణేతగా పెళ్లూరు సునీల్ వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన, సభ్యులు మోపూరు పెంచలనరసింహం, అన్నం శివకృష్ణ, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, కె.అంకబాబు, మాధవ్, సుధ తదితరులు పర్యవేక్షించారు.



సోమేపల్లిని సత్కరిస్తున్న నిర్వాహకులు

బీచ్ కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(దర్గామిట్ట) : ఆగస్టు 2, 3, 4 తేదీల్లో ఇందుకూరుపేటలోని ఎంఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న 11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నగరంలోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ బీచ్ కబడ్డీ పోటీలు ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రి వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

వెంకటాచలం: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ గాయపడిన ఘటన వెంకటాచలం మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శనివారం జరిగింది. నెల్లూరు నుంచి కృష్ణపట్నం పోర్టు వైపునకు పొట్టు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ తాటిపర్తిపాళెం సమీపానికి చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ పెంచలయ్యకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.